# పరీక్ష నెగ్గిన మాలతి

గదంతా అగరువత్తుల పరిమళంతో, ఫిలిప్సు బల్బుల కాంతితో నిండిపోయి శోభాయమానంగా వున్నది. ఒకమూల టేబుల్ మీద రకరకాల తినుబండారాలు చక్కగా పళ్ళేరాలలో అమర్చబడి చవులూరిస్తున్నాయి.

మరో ప్రక్క మాలతి తలవంచుకుని నిలబడి వున్నది. ఆవేదన ఆమె కళ్ళలో స్పష్టంగా కనిపిస్తూంది. తలయెత్తి గోడనున్న గడియారంనంక విచారంగా చూసింది. పదకొండు కావస్తూంది.

తనను యెందుకలా బాధ పెట్టటం? ఒక్క మాటయినా మాట్లాడించకుండా ముభావంగా కఠినంగా అతను తన సంగతే పట్టనట్లు ఎందుకు ప్రవర్తించాలి! అతను గదిలో ఆమ్మూలా, తను యీమూలానా? తను లోపలికి వచ్చి గంట కావస్తూంది. ఇంకా అలా నిల్చునే వుంది. తనను అలా బాధ పెట్టకపోతే వచ్చి పలుకరించ కూడదూ?

మాలతి కళ్ళు చెమ్మగిల్లాయి. కనుకొనల్లో నీరు లైటు

కాంతిలో తళతళ మెరిసింది. రాను రాను ఆమెలో సహనం సన్నగిల్లింది. తనను యెందుకు పలుకరించకూడదు? లేక తనే పలుకరించాలని భావమా? అతని భావమదే అయితే తనకు సహనం చాలదు. మాలతి అవతలిపక్క కుర్చీలో కూర్చుని దీర్ఘంగా ఆలోచిస్తున్న సుదర్శనం వంక చూసింది. అతని ప్రవర్తన చూస్తుంటే తనగొడవే పట్టినట్లులేదు. చదువుకున్న వాడు. అతను ప్రవర్తించవలసిన విధమేనా అది? మరో పావు గంట గడిచింది. మాలతి ఏద్రో నిశ్చయించుకుని తల యెత్త బోతూంది, అంతలోనే సుదర్శనం కంఠస్వరం వినివించింది.

"ఇదిగో?"

ఎంతో కఠినంగా, చిరాకుగా అన్నమాట మాలతిని అమితంగా గాయపరిచింది.

"మాలతీ! నీతో ఒక విషయం చెప్పాలి" అదే స్వరంలో అన్నాడు. ఆమె అతనివైపు చూడలేకపోయింది.

"కంగారుపడకు. నీతో ఒక ముఖ్యమయిన విషయం మాట్లాడుతున్నాను. నువ్వంటే నాకు యిష్టంలేదు."

మాలతి త్రుళ్ళిపడింది. తను వింటున్న నెవరిమాటలు? అతను అనవలసిన మాటలేనా యివి?

"నిజంగా నువ్వంటే నాకు యిష్టంలేదు. ఇష్టంలేని పెళ్ళి చేశారు కట్నంకోసం ఆశించి. నీ ముందు యీ విషయం చెప్పటానికి జంకనక్కర్లేదు. ఎందుకంటే యికముందు మన జీవితం యెలా వుంటుందో ముందుగానే తెలుసుకుంటే మంచిది."

మాలతి కన్నులనుండి అశ్రువులు కారి చెంపల

మీదుగా జారిపోతున్నాయి. "మీరంటున్న మాటలు నాకేం అర్థం కావటంలేదు" అన్నది చివరికి.

సుదర్శనం చలించలేదు. "నేనేమీ సంస్కృతం మాట్లాడలేదు. ఇంకా విపులంగా చెప్పమంటే చెప్తాను: ఇప్పుడు కాదు, ఇకముందు కాదు, ఎప్పుడయినా సరే మనం సుఖంగా వుండటం అసంభవం అని గ్రహించాలి" అన్నాడు.

మాలతి చేతుల్లో ముఖం కప్పుకుంది. భర్తచేత అటువంటి మాటలు వినవలసివస్తే ఏ స్త్రీ హృదయం క్షోభించదు!

"అలా అనకండి. నా జీవితం ఏమయిపోవాలి?"

"నాకేం," సుదర్శనం అన్నాడు. "నువ్వు ఏమయితే నాకేం? నిన్ను నాకు బలవంతంగా అంటగట్టినప్పుడు నేను నీ విషయం ఎందుకు పట్టించుకోవాలి? అయినా మన దాంపత్యం సుఖవంతం కాకపోవటానికి మరోకారణంకూడా వుంది. నా హృదయం మరొకరి అధీనమయిపోయింది. నీముందు నా రహస్యం వెల్లడి చేసుకోవటానికి భయపడవలసిన అవసరం లేదనుకుంటాను."

మాలతి భరించరానిమాట వినవలసి వచ్చింది. ఆదిలోనే హంసపాదం. తను కనిన కలలు, ఆశించిన సుఖం వృథా కావలసిందేనా?

"ఏమాలోచించుకున్నావు?"

మాలతి వెక్కి వెక్కి ఏడ్చింది. సుఖవంతంగా గడుపవలసిన రాత్రి కన్నీళ్ళపాలయిపోతూంది. పద్దెనిమిదేళ్ళ వయ

స్సులో గల మాలతి యీ భయంకర పరిణామంచూసి కంపించి పోయింది.

"నన్ను ఏమయినా చేయండి. మిమ్మల్ని విడిచి నే నెక్కడికీ పోలేను. నన్ను హింసించకండి" అన్నది ప్రార్థేయ పూర్వకంగా.

"లాభంలేదు మాలతీ! ఆ విషయం త్రోసివెయ్యి. నువ్వంటే యిష్టంలేని నాతో వుండి కష్టపడమని కోరటంలేదు నేను. నీ యిష్టం. నీ యిష్టంవచ్చినట్లు చేసుకోవచ్చు. ఇష్టము యితే మీ యింట్లోనే వుండిపో."

మాలతి గిజగిజ లాడింది. "మా యింట్లోనా?"

"ఏం?"

"నే నేం చెప్పగలను? భర్త యింట్లోవుండక పుట్టింట్లో వుంటే లోకం ఏమంటుంది? అడిగినవాళ్ళకి నే నేం సమాధానం చెప్పేది?"

"అయితే ఏం చేస్తానంటావు?"

"ఏమంటాను? మీ పంచనే వుంటాను. ఈ దీనురాలి మీద ఆ మాత్రం దయచూపించండి."

"నీ యిష్టం. కాని ఆ యింట్లో నువ్వు నా సతిగా సంచరించలేవు."

మాలతి నిట్టూర్చింది. "మీ యిష్టం! దాసీదానిలాగ పడివుండమన్నా వుంటాను"

"నీ యిష్టం వచ్చినట్లు చెయ్యి. కాని ఆ యింట్లో పరిస్థితులు నీకు అనుకూలంగా వుండక పోవచ్చు. నీ కిష్ట మయితే మొదట చెప్పానే ఆమెనే..."

అతనామాట పూర్తి చేయకుండానే మాలతి అతని పాదాలమీద వ్రాలిపోయింది. వెక్కి వెక్కి ఏడ్చింది.

"అన్నమాటలే అని నన్ను హింసించకండి. దాసీ దానిలానే చూడండి. మిమ్మల్ని విడిచి ఎక్కడకు పోతాను."

సుదర్శనం చేతులు మాలతిని సున్నితంగా లేవనెత్తాయి. వింత పడుతూ అతని ముఖంలోని చూచింది. పూర్వపు కాఠిన్యం లేదందులో. జాలి నిండుకుని ఉంది. పెదిమలమీద చిరునవ్వు మొలకరించింది.

"లే మాలతీ" అంటూ అక్కున చేర్చుకున్నాడు సుదర్శనం. మాలతికి ఏదో లోకంలోకి పోయినట్లు అనిపించింది. భర్తను ఏమీ అడుగలేక ప్రశ్నార్థకంగా చూసింది.

"నేను యింతకుముందు అన్నదంతా వట్టిదే మాలతీ! నీ మనస్సు ఎటువంటిదో కనుక్కునేందుకు యుక్తి పన్నాను" అన్నాడు సుదర్శనం. తడారిపోయిన మాలతి పెదవులమీద చిరునవ్వు వెలిసింది. దుఃఖాశ్రువులుఆనందాశ్రువులుగామారాయి.